**జరిగిన కథ :** కాశీలో చదువుకున్న ఏడుగురు మిత్రులు ధారా నగరంలో కలుసుకుని, భోజరాజు వద్ద ఉద్యోగాలు సంపాదించుకోవాలని తీర్మానించుకున్నారు. వారిలో మొదటివాడైన దత్తకుడు.. యక్షుని శాపం వల్ల స్త్రీగా మారి, భోజరాజు కూతురి వద్ద చెలికత్తెగా ఉంటున్నాడు. రెండోవాడైన గోణికాపుత్రుడు ఇంకా ధారానగరానికి చేరుకోలేదు.







అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

# వరించి వచ్చిన వనిత

పాటలీపుత్ర నగరం.. మగధ దేశానికి రాజధాని. గోణికాపుత్రుడు తన ధారానగర ప్రయాణంలో భాగంగా పాటలీపుత్రానికి చేరుకున్నాడు. ఆ సమయానికి చీకటి పడిపోయింది. ఆ రాత్రికి సత్రం వెతుక్కునే అవకాశంలేక ఒక ఇంటి అరుగుమీద పడుకుని నిద్రపోయాడు.

ఆ ఇల్లు రతినూపుర అనే వేశ్యది. వయసులో ఉండగా ఎందరో కుబేరుల వంటి విటులను జోగులను చేసిన ఘనత ఆమెది. భూములు, మిద్దెలు, మేడలు చాలా సంపాదించింది. నడి వయసులో సంతానం కోసం చాలా పరితపించింది. ఎన్నో వ్రతాలు చేసింది. చివరికి ఒక విప్రుని వల్ల ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. వేశ్యలకు ఆడపిల్ల పుట్టడం అంటే.. రాజుకు పాలించే అర్హత కలిగిన పట్టభద్రుడైన కొడుకు పుట్టడంతో సమానం కదా!

ఆ పిల్లలిద్దరికీ చిత్రసేన, రతిమంజరి అని పేర్లు పెట్టి పెంచసాగింది. వాళ్లిద్దరూ చిన్నతనం నుంచి సంగీత సాహిత్యాలలో చక్కని కృషిచేశారు. క్రమంగా వారిలో యవ్వనం అంకురించింది.

ఒకరోజున రతినూపుర తన కూతుళ్లను చేరి..

''అమ్మాయిలూ! కాముకులకు శరీరమిచ్చి, డబ్బు సంపాదించుకోవడం మనకు కులధర్మం. గణిక, రూపాజీవ, కుంభదాసి, కారిక అని వేశ్యలలో నాలుగు రకాల వారుంటారు. గణిక అంటే పుణ్యకార్యాలలో పాల్గొంటూ, ఒక్క పురుషుణ్నే పతిగా ఎంచుకుని ధనం ఆర్జించేది. రూపాజీవకు గొప్ప రూపం లేకపోయినా, పటాటోపం హెచ్చుగా ఉంటుంది. అనేకమంది పురుషులను ఆశ్రయించుకుని ఉంటారు. ఇక రాజస్త్రీల వద్ద సంచరించే దాదులను కుంభదాసులు అంటారు. భర్త మరణానంతరం వేశ్యావృత్తిని అనుసరించే వారిని కారికలుగా పిలుస్తుంటారు. వీరందరిలోనూ గణిక ఉత్తమురాలు. మీరు ఏదో ఒక మార్గంలో ప్రవేశించి ధనం ఆర్జించండి'' అంటూ హితబోధ చేయసాగింది.

అందుకు చిత్రసేన..

''అమ్మా! మేము కులవృత్తి చేపట్టబోం. పెళ్లి చేసుకుంటాం'' అని రూఢిగా చెప్పింది.

''పిచ్చిదానా! ఇదెక్కడి చోద్యమే.. ఎక్కడైనా ఉందా?! అయినా పెళ్లాడటం ఎంత నరకమో తెలుసా? అత్తమామలకు నోరెత్తి సమాధానం చెబితే ఒక తప్పు.. చెప్పకపోతే మరో తప్పు. మరుదుల ముందు నిలిచి మాట్లాడటం తప్పు. ఆడబిడ్డకు ఎదురురావడం తప్పు. వాకిట్లో మామగారు కూర్చునుండగా ఆ దిక్కుకే పోవడానికి లేదు. బావగారి కంట పడటానికి లేదు. ఎరగక వాకిట్లో నిలబడటం తప్పు. నవ్వుతూ మాట్లాడటం తప్పు. జడ వేసుకుంటే వేళాకోళమాడతారు. కొప్పు వేసుకుంటే మరో తీరుగా వెటకారం చేస్తారు. చిన్నబొట్టు పెట్టుకుంటే ఒక తప్పు. చక్కని చీర కట్టుకుంటే పాపిష్టి కళ్లన్నీ ఆ ఇంటికోడలి మీదనే ఉంటాయి. ఇన్నిటినీ ఎలాగైనా సహించవచ్చు.. కానీ భర్త కోపిష్టి వాడైతే ఆ ఇల్లాలు పడే పాట్లు బ్రహ్మదేవుడెరుగు. పిచ్చితల్లీ మగనాలితనం శత్రువుకు కూడా వద్దు'' అన్నది తల్లి.

''నోటికొచ్చినట్లు మాట్లాడకు. ధర్మాన్ని పాటించే సాధ్వీమణికి హితులందరూ ఊడిగం చేస్తారు. భర్త సగం దేహమిచ్చి పాలిస్తాడు. దేవతలు ప్రీతి చెంది వరాలిస్తారు'' అని బదులిచ్చింది చిత్రసేన.

''ఒసేయ్.. మీకు బొత్తిగా ఇంత లోకజ్ఞానం లేకుండా పోయిందేమిటే?!'' అంటూ రతినూపుర లబోదిబోమన్నది.

''అమ్మా! చిన్నతనంలో నేను దత్తకుడు అనేవాడితో కలిసి చదువుకున్నాను. పెరిగి పెద్దయిన తరువాత పెళ్లిచేసుకోవాలని అప్పట్లోనే మేమిద్దరం మాటిచ్చి పుచ్చుకున్నాం. ఇది తప్పదు'' అన్నది చిత్రసేన.

అక్క మాటలకు సంతోషించిన రతిమంజరి ఆమె వద్దకు వచ్చి, చెవిలో ఏదో చెప్పింది.

చిత్రసేన చెల్లెలు చెప్పినది విని..

''భలే! గురువు చెప్పినట్లుగా నడుచుకోవడమే బుద్ధిమంతులు చేయాల్సింది. రేపు ఉదయమే ఆ పని చెయ్యి'' అన్నది.

''సరేనక్కా!'' అన్నది రతిమంజరి.

ఆ రాత్రంతా.. 'ఎప్పుడు తెల్లవారుతుందా!?' అని ఎదురు చూస్తూ కూర్చున్నది రతిమంజరి. బ్రాహ్మీముహూర్తంలోనే తలస్నానం చేసి, పట్టుచీర కట్టింది. చక్కగా అలంకరించుకుని, చేతిలో వరమాల పట్టుకుని సింహద్వారం తీసింది.

అప్పుడే వెలుగురేఖలు విచ్చుకుంటున్నాయి. ఆ వీధిలో జనాలెవరూ తిరగడం లేదు. కానీ, అరుగుమీద